ప్రజాశక్తి
ఆదివారం 9 మార్చి 2025



ఇంటర్ పరీక్షకు 932 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
శనివారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం లెక్కలు, జువాలజీ, చరిత్ర, ఒకేషనల్ 1 పేపర్ పరీక్షకు 932 మంది గైర్హాజరయ్యారు. మొత్తం పరీక్షకు 21,707 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వారిలో 20775 మంది హాజరయ్యారని ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ తెలిపారు. శనివారం 66 కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.

ఆడపిల్లలకు చదువు, శక్తిని అందించండి

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత
- ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు
- 30 వేల మందికి రూ.450 కోట్ల విలువైన ఆస్తులు పంపిణీ
- మూడో బిడ్డ ఆడపిల్ల అయితే రూ.50వేలు నజరానా ప్రకటించిన ఎమ్‌పి



సభలో మాట్లాడుతున్న హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి-విజయనగరం కోట
ఆడపిల్లలకు మంచి చదువును, తమ కాళ్లపై తాము నిలబడే శక్తిని అందించాలని రాష్ట్ర హోంశాఖామంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. ఆడపిల్లలకు ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తట్టుకోగల ధైర్యాన్ని, స్థైర్యాన్ని అలవాటు చేయాలని కోరారు. స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో సెర్ప్, మహిళా శిశు సంక్షేమశాఖ, వైద్యారోగ్యశాఖ, మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల సేవలను, త్యాగాలను గుర్తించి, మహిళా దినోత్సవం ద్వారా వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత ఈ సమాజంపై ఉందన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారని చెప్పారు. మగపిల్లలకంటే ఆడపిల్లలే నయం అన్న రోజులు వచ్చాయని అన్నారు. మహిళలకు ఎనలేని గౌరవాన్ని ఇచ్చి, వారికి ఆస్తిలో వాటా అందించిన ఘనత ఎన్‌టిఆర్‌కే దక్కిందన్నారు. పిల్లల పెంపకంపై ప్రత్యేక దష్టి పెట్టాలని, ఆడపిల్లలతోపాటు, మగ పిల్లలకు కూడా మంచి చెడులను బోధించాలని సూచించారు.
కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, మహిళలు మానవత్వానికి ప్రతిరూపమని, వారే సమాజ శిల్పులని కొనియాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా సుమారు 30వేల మందికి రూ.450 కోట్ల విలువైన వివిధ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఉన్నతి సాధించాలని కోరారు. ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు మాట్లాడుతూ, మహిళల త్యాగనిరతిని, గొప్పదనాన్ని కొనియాడారు. జనాభా పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారని, ఈ మేరకు తమ పార్లమెంటు నియోజక వర్గంలో ఇకనుంచీ పుట్టే 3వ సంతానం ఆడపిల్ల అయితే రూ.50వేలు అందజేస్తామని ప్రకటించారు. మూడో సంతానం మగబిడ్డ అయితే ఆవుదూడ అందజేస్తామని చెప్పారు.
ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల వివక్షత విడనాడాలని, ఈ మార్పు మన కుటుంబం నుంచే ప్రారంభం కావాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విజయనగరం ఎంఎల్‌ఎ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ, ఒకప్పుడు మహిళలు ఉపాధ్యాయురాలుగా, నర్సుగా మాత్రమే రాణించేవారని, ఇప్పుడు అన్ని రంగాల్లో వారికి ఎదురు లేకుండా పోయిందని అన్నారు. రాష్ట్రంలో తొలి మహిళా ఎస్‌పిగా అరుణా బహుగుణ విజయనగరం జిల్లా నుంచే సేవలను అందించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి, జెడ్‌పి 5వ స్టాండింగ్ కమిటీ ఛైర్పర్సన్, బొబ్బిలి జెడ్‌పిటిసి సభ్యురాలు శాంతకుమారి మాట్లాడుతూ, మహిళల శక్తి సామర్థ్యాలను వివరించారు. వివిధ రంగాల్లో, ప్రభుత్వ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన మహిళలకు, ఉత్తమ మండల సమాఖ్యలకు ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు. స్వర్ణాంధ్ర సాధనపై రూపొందించిన విజనారి పుస్తకాన్ని, ఐసిడిఎస్ రూపొందించిన హెల్ప్‌లైన్ నంబర్ల గోడపత్రికలను ఈ సందర్భంగా మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, డిఎంహెచ్ఒ డాక్టర్ జీవనరాణి, మెప్మా పీడీ చిట్టిరాజు, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ జి.ప్రసన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ కవిత, ఎల్‌డిఎం నారాయణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నూకరాజు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు


హోంగార్డుకు చీర, పండ్లు అందజేస్తున్న హోంమంత్రి

మహిళా హోంగార్డు ఇంటిని సందర్శించిన మంత్రి

పోలీసు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న సీనియర్ మహిళా మోంగార్డు ప్రమీల ఇంటిని హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి హోంగార్డు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో మహిళ పోలీసు ఉద్యోగులు, హెరింగార్డు జీవన శైలి ఏవిధంగా ఉంటుందని స్వయంగా తెలుసు కొనేందుకు తాను ప్రమీల ఇంటిని సందర్శించానన్నారు. అనంతరం ఆమెకు మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి చీర, పండ్లను అందజేసారు. సర్వీసు, ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు, విధి నిర్వహణలో ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట ఎస్‌పి వకుల్ జిందాల్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, ఒఎస్‌డి అనిల్ పులిపాటి, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, ఆర్ఎస్ఐలు ఉన్నారు.



లంకాపట్నం హుదూద్ కాలనీ నుంచి ప్రజా చైతన్యయాత్ర చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలి

- కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించే వరకు పోరాటం
- ప్రజాచైతన్యయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను శనివారం నగరంలోని లంకాపట్నం హుదూద్ ఇళ్ల సముదాయం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హుదూద్ ఇళ్ల సముదాయం వద్ద తాగునీరు, కరెంట్ ,మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ ప్రజా చైతన్య యాత్ర చేపడుతున్నామని తెలిపారు. 2009లో నిర్మించిన హుదూద్ ఇళ్లు, పదేళ్ల క్రితం నిర్మించిన టిడ్కో ఇళ్లను నేటికీ లబ్దిదారులకు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. వందల కోట్ల రూపాయలతో నిర్మించిన ఇళ్ల కు విద్యుత్,తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం అన్యాయమని అన్నారు. మూడు రోజులకు ఒకసారి వస్తున్న తాగునీటితో సర్దుకొని జీవిస్తున్నారని, ఇదేమి న్యాయమని ప్రశ్నించారు. మరో వైపు ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం నేటికీ వాటిని అమలు చేయలేదని, బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని తెలిపారు. ఉచిత బస్సు, 18 ఏళ్లు దాటిన మహిళకు నెలకు రూ.1500, తల్లికి వందనం పథకాలను అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా అమలు చేయడం లేదన్నారు. విద్యుత్ ఛార్జీలు, ఆస్తి పన్ను వంటి భారాలు వేయడం సరికాదన్నారు. ప్రజలు నుంచి వచ్చిన సమస్యలు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామని, గుర్తించిన సమస్యలు పరిష్కారం కోసం సిపిఎం చేపట్టే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం,నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి పేదలు, కార్మికులు, రైతులు, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పట్టడం లేదన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు సిపిఎం చేపడుతున్న ప్రజా చైతన్య యాత్ర లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, నాయకులు పి.రమణమ్మ, కె.సురేష్, ఎ.జగన్మోహన్‌రావు,వెంకటేష్,బి.రమణ,జగదాంబ, రామచంద్రరావు, స్థానిక ప్రజలు, పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు వైవి



మృతుని కుటుంబానికి రూ.70లక్షల చెక్కును అందజేస్తున్న జిల్లాజడ్జి సాయి కల్యాణ చక్రవర్తి, ఎన్ఐసి మేనేజర్

లోక్ అదాలత్‌లో 6677 కేసులు పరిష్కారం

ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.70 లక్షల పరిహారం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్
ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 6677కేసులు పరిష్కార మయ్యాయి. రాజయే రాజమార్గమని, కేసులను సామరస్య పూర్వకంగా, స్నేహ పూరిత వాతావరణంలో ఎటువంటి వివాదాలు లేకుండా పరిష్కరించే ఏకైక మార్గం లోక్ అదాలత్ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన అదాలత్ సందర్భంగా ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా పిటిషనర్ తరఫు న్యాయవాదులు, జీవిత బీమా సంస్థల సహకారంతో..ఇటీవల ప్రమాదంలో మరణించిన మిరియాల గౌరీపతి కుటుంబానికి రూ.70 లక్షల బీమా పరిహారం అందించి సత్వర న్యాయం జరిగేలా పోస్కో కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నాగమణి చర్యలు చేపట్టారు. ఈ పరిహారం మొత్తం చెక్కునుజిల్లా జడ్జి సాయి కల్యాణ్ చక్రవర్తి చేతుల మీదుగా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ వలన కక్షిదారులకు సమయం, డబ్బు వృధా కాకుండా ఉంటాయని తెలిపారు.లోక్ అదాలత్ సందర్భంగా విజయనగరం కోర్టులో 3357, పార్వతీపురంలో 416, బొబ్బిలిలో 1114, సాలూరులో 378, శృంగవరపుకోటలో 226, గజపతినగరంలో 321, చీపురుపల్లిలో 571, కొత్తవలసలో 238, కురుపాంలో 56 కేసులు, మొత్తంగా 6677 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా 10,500 మంది కక్షిదారులు రూ.35కోట్లు ప్రయోజనం పొందారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. అదాలత్‌లో జిల్లా జడ్జితో పాటు న్యాయమూర్తులు బి.అప్పలస్వామి, ఎన్.పద్మావతి, కె.నాగమణి, టివి రాజేష్‌కుమార్, బిహెచ్‌వి లక్ష్మి కుమారి, దేవి రత్నకుమారి, బి.రమ్య, పి. బుజ్జి, ఎమ్. శ్రీనివాస రావు, ఎ.హరీష్, నేషనల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ప్రాంతీయ మేనేజర్ సుజాత కుమార్, మేనేజర్ లు సీతాలు, దేదీప్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు : ఎమ్మెల్యే

పారా రాష్ట్ర స్థాయి పోటీల విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
గత నెల మంగళగిరిలో జరిగిన 7వ పారా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి మెడల్స్ సాధించిన జిల్లాకు చెందిన పారా క్రీడాకారులను శనివారం డిఎస్‌డిఒ కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అతిథి గజపతిరాజులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు మాట్లాడుతూ ప్రతిభకు వైకల్యం అడ్డు కాదని పారా క్రీడాకారులు నిరూపిస్తున్నారని, ఇతర క్రీడాకారులకు ఏ మాత్రం తీసిపోని విధంగా మెడల్స్ సాధించడమే కాకుండా రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాను రెండో స్థానంలో నిలపడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి జిల్లా పేరు, ప్రఖ్యాతలు మరింతగా పెంచాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు మెడల్స్ వేసి, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వయం అభివృద్ధి సాధించుకోవాలి : ఎమ్మెల్యే

మహిళలు ఒక శక్తిగా ఎదగడానికి స్వయం అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఆదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. స్థానిక మహిళా ప్రాంగణంలో కార్పొరేషన్ కాపు కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేసిన కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 600 మందికి ట్రైనింగ్ ఇచ్చి కుట్టు మిషన్లు అంది స్తామని తెలిపారు. రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజీరావు, డిఎం పి.విమల, టిడిపి నాయకులు లక్ష్మీ వరప్రసాద్, అనురాధా బేగం, జనసేన నాయకులు రౌతు సతీష్, నాయుడు పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చే బహుమతి ఇదేనా?

- మహిళా దినోత్సవం రోజున ఛత్తీస్‌ఘడ్ బదిలీ
- కర్లాం వెంకటరామా పౌల్ట్రీ గేటు వద్ద నిరసన

ప్రజాశక్తి - చీపురుపల్లి
మహిళా దినోత్సం రోజున కర్లాం వెంకటరామా పౌల్ట్రీలో పనిచేస్తున్న మహిళా కార్మికులను యాజమాన్యం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో విధులు చేయాలని బదిలీ చేసింది. దీంతో మహిళా కార్మికులంతా మహిళా దినోత్సవం రోజున యాజమాన్యం ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ పౌల్ట్రీ ప్రధాన గేటు వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము కర్లాం వెంకటరామా పౌల్ట్రీలో సుమారు 13 సంవత్సరాలు నుండి విధులు నిర్వహిస్తున్నామని ఇప్పుడు సడెన్‌గా తమని వేరే రాష్ట్రానికి బదిలీ చేసామని చెప్పడం వెనుక యాజమాన్యం ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సం సందర్భంగా దేశంలోని ఏ యాజమాన్యం ఇవ్వని బహుమతి తమకి కర్లాం వెంకటరామా పౌల్ట్రీ ఇచ్చిందని వారు ఆగ్రహించారు. చదువురాని తమని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో పని చేసేందుకు వెల్లాలని లేదంటే ఉద్యోగాలు మానేసి ఇళ్లకు వెళ్లిపోవాలని యాజమాన్యం మొండి వైఖరి అవలింబిస్తోందని మహిళా కార్మికులు వాపోయారు. ఈ విషయమై చీపురుపల్లి ఆర్‌డిఒ దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని చెబుతున్నారు. పోలీస్, లేబర్ అధికారుల వద్ద మొరపెట్టుకున్నప్పటకీ తమకి న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని మహిళా కార్మికులు హెచ్చరిస్తున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంబళ్ల గౌరినాయుడు, యూనియన్ అధ్యక్షులు ఇప్పిలి గురునాయుడు, కార్మికులు పాల్గొన్నారు.


పౌల్ట్రీ గేటు వద్ద నిరసన తెలుపుతున్న మహిళా కార్మికులు

మహిళల రక్షణకు 'శక్తి'

ప్రజాశక్తి-విజయనగరంకోట
మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులతో రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత పోలీసు కార్యాలయ ప్రాంగణంలో శనివారం వారితో మమేకమై ఇష్టా గోష్టి నిర్వహించారు. తొలుత మంత్రి కేక్ కట్ చేసి, మహిళా ఉద్యోగులకు పంచి పెట్టారు. అనంతరం మహిళా పోలీసు అధికారులు, మహిళ సంరక్షణ పోలీసులు, పోలీసు కార్యాలయ ఉద్యోగులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలిపి, వారిలో స్ఫూర్తి నింపారు. మహిళా పోలీసు ఉద్యోగులు విధి నిర్వహణలో ఉన్నపుడు వారి పిల్లల సంరక్షణను చూసేందుకు ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవ్వరూ లేని సమయంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని సంరక్షించేందుకుపోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏదైనా చైల్డ్ కేర్ సెంటరు ప్రారంభిస్తే బాగుంటుందని కోరగా, అందుకు సానుకూలంగా స్పందించారు. , త్వరలో ముఖ్యమంత్రితో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల్లో డ్రగ్స్, మహిళల భద్రత పట్ల అవగాహన కల్పించేందుకు వుమన్ చైల్డ్ సేఫ్టీ వింగ్‌ను త్వరలో నెలకొల్పుతామన్నారు. అనంతరం, విధి నిర్వహణలో సమర్ధవంతంగా సేవలందిస్తున్న పోలీసుశాఖలో మహిళా ఉద్యోగులను సన్మానించి, జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను అందజేసారు. వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికేట్‌లు అందజేసారు. జిల్లా పోలీసుశాఖ మహిళల భద్రతకు ప్రత్యేకంగా రూపొందించిన మహిళ భద్రత లోగోను ఆవిష్కరించారు. అనంతరం, మహిళా ఉద్యోగులకు మంత్రితో పాటు జిల్లా ఎస్‌పి, కమాండెంట్, స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు స్వయంగా వడ్డించి, వారితో కలసి, సహ పంక్తి భోజనం చేసారు. కార్యక్రమంలో పలువురు పోలీసుశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మహిళా పోలీసులకు భోజనాలు వడ్డిస్తున్న హోంశాఖ మంత్రి వనిత

మహిళల భద్రతకు అండగా ఉంటాం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట
మహిళల భద్రతగా అండగా నిలుస్తామని ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. అన్ని రంగాల్లో రాణించాలంటే చట్టాలపట్ల అవగాహన తప్పనిసరి అని అన్నారు. మహిళా దినోత్సవ వేడుకలను పోలీసుశాఖ ఆధ్వర్యంలో మహిళా పోలీసు స్టేషను ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌పి మాట్లాడుతూ మహిళలను గౌరవించడమనేది అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మాత్రమే ఇచ్చే ప్రక్రియ కాదని, ప్రతీ రోజూ మహిళలను గౌరవించడం మనందరి బాధ్యత అని అన్నారు. మహిళలు ఇంటి నుండి బయటకువచ్చినపుడు తాము పని చేసే, చదువుకొనే ప్రాంతాల్లో కొన్ని ఇబ్బందులు ఎదురవ్వవచ్చునన్నారు. వీటిపై , ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కష్ట సమయాల్లో వారికి పోలీసులు అండగా నిలుస్తారని తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు, తిరుమల-మెడికవర్ వైద్యులు ఐ.కృష్ణశాంతి రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న హైందవి, సభకు అధ్యక్షత వహించిన అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత మాట్లాడారు. అనంతరం, మహిళా పోలీసు స్టేషను నుండి ఆర్ అండ్ బి జంక్షను వరకు నిర్వహించిన ర్యాలీని ఎస్‌పి ప్రారంభించారు. ఆర్‌అండ్ బి జంక్షనులో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించి, మహిళలను ఉత్సాహపర్చారు. డిఎస్‌పిలు శ్రీనివాసరావు, జి.భవ్య రెడ్డి, వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం పక్కదారి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పాలకులు దారి మళ్లించారా? మహిళల మెప్పుకోసం, నిరుద్యోగ యువతుల అసహనాన్ని చల్లార్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ ప్లే చేస్తారా? అంటే ఉమ్మడి విజయ నగరం జిల్లాలో ఔననే సమాధానం వినిపిస్తోంది. ఇందుకు కారణం లేకపోలేదు. మహిళా దినోత్సవం అంటే ఒకప్పుడు కమ్యూనిస్టులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు మాత్రమే నిర్వహించేవి. క్రమంగా మన జిల్లాలోని పాలకులు సైతం నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా ప్రభుత్వం ఆధ్వర్యాన మునుపెన్నడూ లేనంతగా శనివారం అట్టహాసంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఇందులో తప్పేమీ లేదు. కానీ, నిర్వహణ తీరులోనే లోపం, రాజకీయ దురుద్దేశం ఉందని జనం అంటున్నారు. మహిళల పోరాట స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా ఉండడమే ఇందుకు కారణం. మహిళా దినోత్సవం అంటే పండగ కాదు. పురుషులతో సమానంగా వేతనం కల్పించాలని, పనిగంటలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ 1908లో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 15వేల మంది మహిళలు భారీ ప్రదర్శన నిర్వహించారు. దీనికి స్ఫూర్తిగా అక్కడి సోషలిస్టు పార్టీ 1909లో అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించి వివిధ కార్యక్రమాలు నిర్వహించింది. క్రమంగా ప్రపంచ దేశాలకు ఈ కార్యక్రమం విస్తరించింది. ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రపంచ దేశాలన్నీ నిర్వహిస్తున్నాయి. తొలుత శ్రామిక



మహిళలు ఈ కార్యక్రమానికి నాంది పలికితే, ఆ తర్వాత మహిళా కమ్యూనిస్టులు నాయకత్వం వహించి మరింత ముందుకెళ్లారు. అందులో భాగంగానే నేడు ప్రభుత్వం మహిళా దినోత్సవం నిర్వహించినట్టు బయటకు కనిపించినప్పటికీ లక్ష్యం వేరుగా కనిపిస్తోందని పలువురు విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి మహిళలు ఇప్పటికీ ఇంటా బయటా అనేక సమస్యలు, వేధింపులు, వివక్ష ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల పురుషుల కన్నా ఎక్కువ పనిచేస్తున్నప్పటికీ వారితో సమానంగా వేతనం ఇవ్వడం లేదు. పని ప్రదేశాల్లో మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారు. ప్రేమపేరిట వంచించినవారు, ప్రతిఘటిస్తే అత్యాచారాలు, హత్యలు నిరంతరాయంగా మారాయి. ఇటువంటి పరిస్థితుల్లో నిందితులను శిక్షించేందుకు ఎన్ని చట్టాలు ఉన్నా వాటిని పాలకులే అమలు చేయడం లేదు. గృహ హింస వంటి కేసులు కూడా నీరుగారిపోతున్నాయి. సాక్షాత్తు పోలీస్ శాఖలోనే మహిళల వేధింపులు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేరలేదు.
ఇటువంటి పరిస్థితుల్లో మహిళా సంఘాలు, లేదా పురుషాధిక్యతను విభేదించేవారు మహిళల హక్కుల కోసం, ప్రభుత్వ హామీల అమలు కోసం అవకాశం ఉన్నంతవరకు, పోరాడుతున్నారు. మహిళ సంక్షేమం, అభివృద్ధి, వేధింపులు, దాడుల నివారణకు ఏం చేయాలి? ప్రస్తుత పరిస్థితుల్లో ఏమేరకు చేయగలం అన్న విషయాలు ప్రభుత్వాలు ఆలోచించి ఇలాంటి మహిళా దినోత్సవం రోజున ప్రకటించ వచ్చు. కానీ, అటువంటి కార్యక్రమాలు నిర్వహించలేదు. సభలు, సమావేశాలు పెట్టి మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు ప్రభుత్వాలు ఇందుకు సహకరించడమే కారణం అన్నట్టుగా చెప్పుకొచ్చారు. కానీ, మహిళలు, వారి తరపున మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్న సమస్యలపై మాత్రం స్పందించలేదు. పోలీసు శాఖ అయితే మరో అడుగు ముందుకు వేసి కళాశాల స్టూడెంట్లతో విజయనగరంలోని ఆర్‌అండ్‌బి జంక్షన్ వద్ద ఆరు బయట ఎండలో డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ట్రాఫిక్‌ను స్తంభింపజేసి, రోడ్డుపైనే డిజెలు పెట్టేశారు. మహిళల అభ్యున్నతి సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆయా కాలేజీలు, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యాన నీడలో ఏర్పాటు చేసి, మహిళలు ఎదుర్కొటున్న సమస్యలు, ముఖ్యంగా ప్రేమపేరిట జరుగుతున్న మోసాలు, అత్యాచారాల ప్రతిఘటన, మహిళ రక్షణ కోసం ఇప్పటికే ఉన్న చట్టాలపై అవగాహన వంటి అంశాలపై వివరిస్తే వారిలో కొంత ఆత్మ స్థైర్యం వస్తుంది. ఇవేవీ చేయకుండా కేవలం ఆటపాటలతో ఉత్సవంలా గడిపేయడం వల్ల పాలకపక్షాలపై మహిళల ఒత్తిడి తగ్గుతుంది తప్ప, వారికి ఒరిగేదేమీ ఉండబోదని పబ్లిక్ టాక్.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలో మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో మహిళలు కౌన్సిలర్లు సమక్షంలో కమిషనర్ ఎల్.రామలక్ష్మి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. జనసేన కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి మహిళలను సన్మానించి నూతన వస్త్రాలు అందించారు. కోర్టులో మహిళా దినోత్సవం నిర్వహించి మహిళా చట్టాలపై జడ్జిలు ఎస్.అరుణశ్రీ, ఎం.రోహిణీరావు వివరించారు. డిఎస్‌పి భవ్యరెడ్డిను రోటరీ క్లబ్ ప్రతినిధులు జేసీ రాజు, ఎస్.శ్రీనివాస్, వి.శ్రీహరి సత్కరించారు.

విద్యారంగ పరిరక్షణకు నిరంతర పోరాటం

బొబ్బిలి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తానని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి అన్నారు. పట్టణంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర కీలకమని, హక్కుల సాధనకు మహిళలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. హింస, వేధింపులు, విద్య లేమి, తదితర సమస్యల పరిష్కారానికి కార్యాచరణను వేగవంతం చేయాలని, పిలుపునిచ్చారు. సదస్సు లో మాట్లాడిన కెజిబివి బొబ్బిలి ప్రిన్సిపాల్ స్వప్న, రామభద్రపురం, బొబ్బిలి, సీతానగరం మండలాల మహిళా నాయకులు మాట్లాడుతూ నైతిక విలువలు,మంచి విద్య కోసం కృషి చేయాలని అన్నారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్న కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు మహిళా టీచర్ల కార్యాచరణలో ఉందని అన్నారు.జిల్లా కార్యదర్శి కేశవరావు, నాయకులు మహేష్, శ్రీనివాస్, కృష్ణ దాసు, మన్యం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, శశిభూషణరావు, శివ మాస్టారు ఐదు మండలాల మహిళా టీచర్లు పాల్గొన్నారు. అనంతరం సమాజ అభివృద్ధి లో మహిళా టీచర్ల పాత్ర అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన సుగుణ, స్వప్న, శ్రీదేవి లకు బహుమతులు అందజేశారు.



బొబ్బిలి : విజయ చిహ్నాన్ని చూపిస్తున్న ఉపాధ్యాయులు

డెంకాడ: 5వ బెటాలియన్ యూనిట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఎపిఎస్‌పి కమాండెంట్ మల్లికా గార్గ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో కొంత మంది మహిళలకు మహిళా దినోత్సవ సందర్భంగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ మహిళా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోగ్న, మినిస్టీరియల్ స్టాఫ్ ఎ.ఓ. శోభారాణి, లలితాకుమారి పాల్గొన్నారు.

చీపురుపల్లి: జనవిజ్ఞాన వేదిక, సమతా విభాగం ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను, దాని ప్రాధాన్యతను గూర్చి పలువురు వివరించారు. ఈ కార్యక్రమంలో సమతా కన్వీనర్ ఎం సుశీల, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, స్త్రీల వైద్యులు తులసీ మహలక్ష్మి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎం నిర్మల, జెవివి మహిళా ఉపాధ్యాయులు, శశికళ, జి పద్మావతి, ఎం వెంకటమ్మ, డాక్టర్ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మహిళా శక్తి తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని మహిళలు తమ వంటింటి నుంచి ఏకంగా అంతరిక్షానికి ఎదగడమే దానికి నిదర్శనమని ప్రముఖ వైద్య నిపుణులు పొట్నూరు వరలక్ష్మి, ప్రముఖ మహిళా న్యాయవాది ముక్కు అనురాధ అన్నారు. శనివారం మండలంలోని బొడ్డవర గ్రామంలో వాసవి మహిళా సంఘం అధ్యక్షులు పూసర్ల కోటీశ్వరి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ మహిళా ప్రతినిధి రవి కుమారి, వాసవి సంఘం మహిళా ప్రతినిధులు పద్మ, ధనలక్ష్మి, శైలజ, అన్నపూర్ణ, భారతి, భార్గవి, పల్లవి, కుసుమ, మహాలక్ష్మి, విజయ, సంతోషి, సత్య, శాంతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మహిళా సాధికారత అందరి బాధ్యత కావాలని మాజీ ఎంపిపి, టిడిపి పార్లమెంట్ మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పలువురు మహిళా నేతలను వనజాక్షి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చి ముందుకు వెళ్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : మహిళా దినోత్సవ సందర్భంగా ఎపి ఎన్జీవో హోంలో ఎన్జిఒ అసోసియేషన్ ఆధ్వర్యాన మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిఎంహెచ్ఒ ఎస్.జీవనరాణి, జిల్లా ఆడిట్ అధికారి బి.ఎల్.అరుణ్‌కుమారి, డివిజనల్ పిఆర్ఒ జానకి, ఎపిఇపిడిసిఎల్ ఎడి హైమావతి, ఇరిగేషన్ ఇఇ కె.హరిత, జి.కనక, మహలక్ష్మి హాజరయ్యారు. మహిళా దినోత్సవం ప్రాధాన్యతను డిఎంహెచ్ఒ వివరించారు. అనంతరం ఆరుగురు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అంతకుముందు నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం శ్రీధర్ బాబు, ఎ.సురేష్, జివిఆర్ఎస్ కిషోర్, వై ఆనంద్ కుమార్, గోపినాథ్, జిల్లా కోశాధికారి ఎస్ వి సుధాకర్, ఎ.కనకరాజు ఎల్ తవుడు, జిల్లా మహిళా విభాగ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, ఆర్.శ్రీస్వప్న, కె.రాధిక తదితరులు పాల్గొన్నారు.

హక్కులను హరిస్తున్నారు

రాజ్యాంగం మహిళలకు హక్కులు కల్పించినప్పటికీ , అవి సరైన రీతిలో అమలు జరగడం లేదని న్యాయవాది బ్యూలారాణి ఆవేదన వ్యక్తం చేశారు.



నెల్లిమర్ల: వనజాక్షిని సత్కరిస్తున్న టిడిపి మహిళా నాయకులు

నవ్యాంధ్ర జిల్లా మహిళా సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె మాట్లాడారు. పరిపూర్ణంగా అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలని ఆమె కోరారు. నవ్యాంధ్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జి.భవాని మాట్లాడారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన పలువురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయం వ్యవస్థాపకులు షణ్ముఖరావు సతీమణి ప్రమీలా రాణి, జెవివి జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి, గండ్రేటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా కిడ్స్ స్కూల్‌లో మహిళా దినోత్సవం

అయ్యన్నపేట జంక్షన్‌లో గల మదర్ థెరిసా కిడ్స్ స్కూల్‌లో, మదర్ తెరిసా సేవా సంఘం అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది. సన్మాన గ్రహీతలు ఎన్‌చిన్నాదేవి, వై.నూతన్ మాట్లాడుతూ పిల్లలను సన్మార్గంలో నడిపించాలని, మరియు మనం మారితేనే ఇల్లు, సమాజం కూడా మారుతుందని అన్నారు.

గిరిజన యూనివర్సిటీలో..

గిరిజన యూనివర్శిటీలో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిసి అటానమస్ కాలేజీ ప్రొఫెసర్ మరియు రిటైర్డ్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ దమయంతి బేష్రా మాట్లాడుతూ ఇంట్లో, పని ప్రదేశంలో మహిళలు జీవితంలోని ప్రతి అంశంలో సమగ్ర మైన పాత్ర పోషిస్తారని, వారిని గౌరవించుకోవడం సమానంగా చూడడం మన భాధ్యత అని అన్నారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని మాట్లాడుతూ మహిళ లు సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ...

విజయనగరం కోట : స్థానిక కోట దగ్గర ఉన్న ఎస్.కన్వెన్సన్ ఫంక్షన్ హాల్ లో విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న 30 మంది మహిళలను సన్మానించారు. జనసేన నాయకులు గురాన అయ్యలు రాధిక దంపతులు మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తామాష్, సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్ తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం : గురజాడ ఇందిరను సత్కరిస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయనగర బాలోత్సవంలో పాల్గొన్న భోగరాజు సూర్యలక్ష్మి, గురజాడ ఇందిర, శ్రీదేవి, చిన్నాదేవి, నాగమణిలను శనివారం ఘనంగా సత్కరించారు. కమిటీ నిర్వాహకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల సహకారం వల్లనే, బాలోత్సవం విజయవంతం అయిందని, మహిళలు అన్ని రంగాలలోనూ ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జియస్ చలం, ఈపు విజయకుమార్, వై శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యా డిగ్రీ కళాశాలలో..

తోటపాలెంలోని సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.అరుణ, పెద్దమజ్జిపాలెం హెల్త్ సెంటర్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎస్.పల్లవి, విజయదుర్గా యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె. చంద్రిక హాజరయ్యారు. కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశిభూషణరావుతో కలసి అతిథులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయిదేవమణి మాట్లాడారు. అనంతరం ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాల అధ్యాపకులను సత్కరించారు.



డెంకాడ : కమాండెంట్ మల్లికా గార్గ్‌ను సత్కరిస్తున్న మహిళలు



విజయనగరం: ఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యాన మహిళలను సత్కరిస్తున్న ప్రతినిధులు



ఎస్‌కోట: మహిళలను సత్కరిస్తున్న వైద్య నిపుణులు

మైనర్లను వేధిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. మండలంలోని ఎం.బూర్జవలసలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు, మహిళలపై దాడులు, వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు పడతాయన్నారు. ఆడపిల్లలకు సమానహక్కులు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిఎం మోహన్‌కుమార్, న్యాయవాది పి.జగన్నాథం, సర్పంచ్ ఎస్.ఈశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యేకు వినతులు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండల కేంద్రం లోని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్క్‌ు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలితకు మారి మాట్లాడుతూ నియోజక వర్గంలోని ఎస్.కోట, జామి, కొత్తవలస, వేపాడ, ఎల్.కోట మండలాల ప్రజలు భారీగా హాజరై భూ సమస్యలు, కొత్త రేషన్ కార్డులు, గృహ నిర్మాణ పథకం బకాయిలు, ఇంటి స్థలాలు, విద్యుత్ సమస్యలు, రోడ్డు నిర్మాణాలు వంటి 25కి పైగా వినతిపత్రం రూపంలో తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వీటన్నిటిపైనా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

ఆహార అలవాట్లపై అవగాహన

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ - ఢిల్లీ ఆధ్వర్యంలో అయోడిన్ లోపం, మంచి ఆహారపు అలవాట్లు, ఐరన్ లోపం వల్ల ఎటువంటి అనారోగ్యాలు వస్తాయనే దానిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం రెండు రోజులు పాటు జరిగిన శిక్షణ సర్టిఫికేట్లను అందించారు. ఐజిడి జిల్లా కోఆర్డినేటర్ వై.అశోక్ అంగనవాడీ టీచర్లకు మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఆ కార్యక్రమంలో విజయనగరం గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ వైద్యులు ఎం. చైతన్య, ఓ.ఆర్.డబ్ల్యు సిబ్బంది అజయ్, కె. స్వాతి, పైడిరాజు, ఆర్.అజయ్, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిరాకిల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని ముంజేరులో ఉన్న మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయనగరం జెఎన్‌టియు యూనివర్సిటీ రిజిస్టర్ జయసుధ ప్రారంభించారు. జిల్లాలోని పలు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు భోగాపురం సిఐ ప్రభాకర్ రావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ లోకం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కళాశాల డీన్ శ్రీనివాస్ బెహరా, ప్రిన్సిపల్ అర్జున్ రావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పి4 సర్వేపై ఎంపిడిఒ అసంతృప్తి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం గ్రామంలో శనివారం జరుగుతున్న పి4 సర్వేను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేసి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతలను సచివాలయ సిబ్బందిలో కొంతమంది సక్రమంగా నిర్వర్తించడం లేదన్నారు. విధులకు డుమ్మా కొడుతూ సర్వే నత్త నడకన సాగిస్తున్నారని దీని వల్ల బాగా కష్టపడి పనిచేసిన మరి కొంత మందికి చెడ్డ పేరు వస్తుందని అన్నారు. ఇప్పటికైనా సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది సిబ్బంది ఏకంగా స్థానిక రాజకీయ నాయకులకు సేవలు చేయడానికి అలవాటు పడిపోతున్నారని ఇది భవిష్యత్తులో వారికి తీవ్ర నష్టాన్ని మిగుల్చుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

విద్యార్థులు సాంకేతికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యార్థులు సాంకేతికంగా అభివృద్ధి చెందాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రౌతు రామమూర్తి, వాసు విద్యా సంస్థలు అధినేత రౌతు వసుదేవరావు అన్నారు. స్థానిక శ్రీనిధి పాఠశాలలో శనివారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో చిన్నప్పటి నుంచి సృజనాత్మకత ఉండాలన్నారు. ఎయిర్ పోర్టు నమూనా, పోస్టాఫీసు పని విధానం, మొక్కలు రకాలు-ఉపయోగం, ఫుడ్ పిరమిడ్, ఇల్లు రకాలు, ఆసుపత్రి పని విధానం, 60 రకాల స్టాల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హెచ్‌ఎంల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడును ప్రధానోపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీని కలసి వినతి అందజేశారు. విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి టి సన్యాసిరాజు, శ్రీకాకుళం జిల్లా బాధ్యులు దాలి నాయుడు, అనకాపల్లి జిల్లా బాధ్యులు శాస్త్రి పాల్గొన్నారు. న్యాయవివాదాల పేరుతో కేవలం ప్రభుత్వ యాజమాన్యంలోని వారినే సీనియారిటీ లో పంచాయతీ రాజ్ వారికన్నా సర్వీసులో జూనియర్స్ అయిన హెచ్‌ఎంను ఉప విద్యాశాఖ అధికారులుగా, ఎంఇఒలుగా ఖాళీ అయిన చోట నియమిస్తున్నారని తెలిపారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులకు కూడా సీనియారిటీని అనుసరించి ఉప విద్యాశాఖ అధికారులుగా నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నదానానికి రూ.50వేలు సాయం

ప్రజాశక్తి -పూసపాటిరేగ

స్థానిక అంబేద్కర్ కాలనీలో నిర్మించిన రామాలయం ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమానికి కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురం సర్పంచ్ బాల అప్పలరాజు రూ.50 వేలు సాయం అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని రాములవారిని దర్శించుకున్నారు. వారితోపాటు సర్పంచ్ టి.సీతారాం, ఆలయ కమిటీ సభ్యులు, జనసేన నాయకులు పతివాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలి

ప్రజాశకి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష లో పని చేస్తున్న కాంట్రాక్టు , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు ఉద్యోగులకు పని చేసే చోట భద్రత కల్పించాలని ఎపి కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బి. కాంతారావు డిమాండ్ చేశారు. శనివారం కెల్పురంలోని ఎన్‌పిఆర్ భవనంలో ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు మాట్లాడుతూ సమగ్ర శిక్షా ప్రాజెక్టులో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని నిరంతరం విద్యా రంగంలో కీలక భూమిక పోషిస్తున్నప్పటికీ, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పిఎఫ్, హెల్త్ కార్డ్స్ వంటి ప్రాథమిక హక్కుల అమలు చేయడం లేదని అన్నారు. మహిళా ఉద్యోగులకు కార్యాలయాల్లో భద్రత కల్పించాలన్నారు. నిరుద్యోగ మహిళలకు ప్రోత్సాహక ఉపాధి అవకాశాలు కల్పించాలి, ప్రస్తుత ఉద్యోగుల సేవలను రెగ్యులరైజ్ చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.పిల్లల సంరక్షణ కోసం చైల్డ్ కేర్ సెలవులను చట్టబద్ధంగా అమలు చేయించాలన్నారు. ఉద్యోగులపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా జెఎసి వైస్-చైర్మన్ పి. తేజేశ్వరీ, జిల్లా కార్యవర్గ సభ్యులు మంగమ్మ, కెజిబివి నాయకులు సిహెచ్ రోహిణి, సిఆర్‌ఎంటి నాయకులు చిన్నమ్మలు, ద్రాక్షాయిని, పార్ట్‌టైం యూనియన్ నాయకులు పార్వతమ్మ, పార్ట్ టైం టీచర్స్ యూనియన్ నాయకులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్నెస్ ఏజెన్సీని రద్దుచేయాలి

ప్రజాశక్తి- డెంకాడ

గరివిడి మండలం అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన వాహనాల ఫిట్నెస్ ప్రైవేటు ఏజెన్సీ (వేదాంత)ని రద్దు చేయాలని కోరుతూ మండలంలోని నాతవలస ఆటో స్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో శనివారం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వల్ల ఉన్న కొద్దిపాటి భూమిని అమ్ముకొని ఆటోలు కొనుక్కొని వాటిని నడుపు కుంటూ కుటుంబాలను పోషించుకుం టున్నారని ఈ పరిస్థి తుల్లో రవాణా రంగ కార్మికులపై అధిక బారాలు వేసి వారి కుటుంబాలను రోడ్డు పాలు చేసేందుకు ప్రభుత్వ చేస్తున్న కుట్రలో భాగంగా కార్పొరేట్ సంస్థ అయినా వేదాంత అనే స్వచ్ఛంద సంస్థకు వాహనాలు ఫిట్నెస్ కాంట్రాక్ట్‌ను కట్టబెట్టిందన్నారు. ఈ ఫిట్నెస్ కార్యక్ర మాన్ని ప్రభుత్వం నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ ప్రైవేటు ఏజెన్సీని రద్దుచేసి దీని నిర్వహణ ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తేదీన కలెక్టరేట్ వద్ద జరగబోయే ధర్నా కార్యక్రమంలో రవాణా కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రమణ, గోవిందా, రాజశేఖర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్ని అంశాల్లోనూ ఆదర్శంగా నిలవాలి

గంట్యాడ: మోడల్ ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీగా ఎంపికైన గంట్యాడ అన్ని అంశాలలోనూ ఆదర్శంగా నిలవాలని డిఎల్‌పిఒ మోహన్‌రావు అన్నారు. శనివారం గంట్యాడ గ్రామ సచివాలయం వద్ద గ్రామ కార్యదర్శి విశ్వనాథం ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. డిఎల్‌పిఒ మోహన్‌రావు మాట్లాడుతూ గంట్యాడ గ్రామపంచాయతీని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌సి కోఆర్డినేటర్ దేవుడు, ఇఒపిఆర్‌డి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి రాళ్లపూడి నారాయణమ్మ, పంచాయతీ వార్డు మెంబర్లు, వివిధ శాఖల ఉద్యోగులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించరా?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రెవెన్యూ అధికారులకు ప్రభుత్వ భూములు పరిరక్షించే బాధ్యత లేదా అని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు ప్రశ్నించారు. శనివారం ఆయన నగర పంచాయతీలో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములు పరిరక్షించాలని డిప్యూటి తహశీల్దార్ రవి శంకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని చంద్రబాబు కాలనీలో సర్వే నెంబరు 60లో ప్రభుత్వ భూములు అక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికార్లు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆక్రమణకు గురైన భూమి తమకు తెలియదని రెవెన్యూ అధికారులు చెప్పడం సమంజసం కాదన్నారు. నగర పంచాయతీ అయినప్పటికీ భూములు విషయం రెవెన్యూ అధికారులదే బాధ్యతన్నారు. కాగా నగర పంచాయతీలో 1400మంది పేదలకు ఇల్లు పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం స్థలం అప్పగించలేదని అధికారులు మాత్రం దీనిపై దృష్టి పెట్టకుండా అక్రమార్కులకు వత్తాసు పలకడం బావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె. పద్మనాభం ఉన్నారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

నగర పంచాయతీ పరిధిలోని, చంద్రబాబు నాయుడు కోలనీలోని సర్వే నెంబర్ 60లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన విషయం తెలుసుకున్న తహశీల్దారు సుదర్శనరావు ఆదేశాల మేరకు శనివారం సిబ్బంది ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సదరు ఆక్రమణకు గురైన భూమిలో 24 గంటల పాటు గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులతో గస్తీ ఏర్పాటు చేసి, ఈ విషయాన్ని కమిషనర్, ఎస్‌కు తెలియజేశామని తహశీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ, విఆర్‌ఒ, విఆర్‌ఎ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎల్లారమ్మ జాతర

ప్రజాశక్తి - జామి

జామి ఎల్లారమ్మ జాతర శనివారంతో ముగిసింది. దీంతో పాటు గ్రామంలోని రావి చెట్టు వీధిలో చిన్న తీర్థం కూడా ముగిసింది. జాతరకు ఈ ఏడాది భారీగా జనం తరలి వచ్చారు. మూడవ రోజు చిన్న తీర్థానికి జనం పోటెత్తారు. చిన్న తీర్థంలో గ్రామానికి చెందిన మహిళాలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. జాతరకు వచ్చిన బంధువులు, స్నేహితుల తిరిగు ప్రయాణాలతో జామి జాతర సందడిగానే సాగింది. పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. మొత్తానికి జామి మూడు రోజుల జాతర ప్రశాంతంగా ముగిసింది.

ఎల్లారమ్మ హుండీ ఆదాయం రూ.21లక్షలు

ఎల్లారమ్మ జాతర హుండీ ఆదాయం గత ఏడాదికన్నా లక్ష రూపాయలు పెరిగింది. గత ఏడాది రూ.19,98,450 ఆదాయం రాగా, ఈ సారి రూ. 21,06,124 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ ప్రసాద్ రావు తెలిపారు. దర్శన టిక్కెట్లు, ప్రసాదాలు, హుండీ, విరాళాలు కలుపుకుని ఈ ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. ప్రసాదం అమ్మకాలపై వచ్చిన ఆదాయం మాత్రం తగ్గింది. టిక్కెట్లు ఆదాయం, హుండీ ఆదాయాలు నామ మాత్రంగానే పెరిగింది. విరాళాలు మాత్రం, గత ఏడాది రూ.1,20,571 చూపించగా, ఈసారి రూ. 2,40,647 వరకు పెరిగింది.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని సీతారామునిపేట మాజీ సర్పంచ్, రామతీర్థం దేవస్థానం మాజీ బోర్డు డైరెక్టర్ బూర్లి సత్యం ఇటీవలే మరణించారని తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేష్ బాబు, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపిలు పతివాడ సత్యనారాయణ, సారికి వైకుంఠం, రేగాన శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

12న యువత పోరు : మాజీ ఎమ్మెల్యే బొత్స

ప్రజాశక్తి - గజపతినగరం

ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో యువత పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నామని, దీన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య పిలుపునిచ్చారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఈ కార్యక్రమాన్ని భారీ ఎత్తున చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి గార తౌడు, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, మాజీ ఎంపిపి కంది తిరుపతినాయుడు, నాయకులు సురేష్, బెల్లాన త్రినాధ రావు, కరణం ఆదినారాయణ, పిఎస్‌ఎన్ మూర్తి, కర్రీ రామనాయుడు, బోని సంగమయ్య, కనకల పైడన్న తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం మోసం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలను అన్ని విధాల మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య విమర్శించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలతో ప్రజలను చంద్రబాబు నయవంచనకు గురి చేశారన్నారు. ఎన్నికల్లో హామీలను గాలికి వదిలి, సరికొత్త రాగాలు తీస్తున్నారన్నారు. బడ్జెట్‌లో ఎన్నికల హామీల ఊసే లేదని, ఏ ఒక్క పథకాన్నీ అమలు చేయకుండా తొమ్మిది నెలల కాలంలోనే రూ.1.40లక్షల కోట్లు అప్పులు చేశారని ఆరోపించారు. ఈ అప్పులు చేసిన డబ్బు ఏమి చేశారని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో చేసిన అప్పులపై తప్పుడు ప్రచారం చేసి ప్రజలను చంద్రబాబు నమ్మించారన్నారు. మహిళా సాధికారిత జగన్‌తోనే సాధ్యమన్నారు.

వైసిపి ఆవిర్భావ దినోత్సవానికి రండి

వేపాడ: ఈ నెల 12వ తేది వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కంటోన్మెంట్ మున్సిపాల్ పార్క్ వద్ద నిర్వహించనున్న వైసిపి ఆవిర్భావ దినోత్సవానికి కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు జగ్గుబాబు ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఉదయం 9గంటలకు జెండా ఆవిష్కరణ చేసి 'యువత పోరు' అనే నినాదంతో విద్యార్థులు, నిరుద్యోగులు యువత ఎదుర్కుంటున్న సమస్యలపై కలెక్టరేట్ వరకు ర్యాలీ చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విజయలక్ష్మికి ఎక్స్‌లెన్స్ అవార్డు

శృంగవరపు కోట: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలలో పట్టణానికి చెందిన సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మికి ట్రైల్ బ్లేజర్ ఉమెన్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందించారు. వాస్తు రత్నభూషణ్ డాక్టర్ పట్నాయిక్ నారాయణమూర్తి, సామాజిక కార్యకర్త, రచయిత్రి జాలాది విజయ, ఫిల్మ్ మేకర్ ఎ.యమ్.ప్రసాద్, ప్రముఖ దర్శకుడు డాక్టర్ మణి భూషణ్‌కుమార్ చేతుల మీదుగా జ్ఞాపికను, ధృవపత్రాన్ని అందజేశారు. రెండు దశాబ్దాలకు పైగా యోగా, పర్యావరణ, రంగాలలో విజయలక్ష్మి చేస్తున్న సేవలను కొనియాడారు. విజయలక్ష్మికు అవార్డు రావడం గాయకుడు, సామాజిక కార్యకర్త దేవీశ్రీ, జియో, సిమ్ స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ, నేషనల్ ట్రైనర్ జీవన జ్యోతి, డాక్టర్ షాలిని, సీనియర్ జర్నలిస్టులు నేమాలి హేమ సుందర్, శారద, రచయిత్రి శ్రేయమంజిరి, రేడియో జాకీ హేమలత, తదితరులు అభినందనలు తెలిపారు.

కుస్తీ క్రీడాకారుడికి అభినందన

నెల్లిమర్ల: కుస్తీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని డిఇఒ మాణిక్యం నాయిడు శనివారం అభినందించారు. కొండవెలగాడ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.మణికంఠ ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబర్చినందుకు డిఇఒ అభినందించి సత్కరించారు. భవిష్యత్‌లో మరెన్నో పతకాలు సాదించాలని చదువులో మంచిగా రాణించాలని సూచించారు. క్రీడాకారుడుని పాఠశాల పీడీ పతివాడ శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది అభినందించారు.